ప్రజాశక్తి
మంగళవారం 24 జూన్ 2025
5
అనంతపురం



ఎపిపిఎస్‌సి మెంబర్‌గా జెఎన్‌టియు ప్రొఫెసర్ సి. శశిధర్



ప్రొఫెసర్ శశిధర్

ప్రజాశక్తి -అనంతపురం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్‌గా అనంతపురం జెఎన్‌టియు మాజీ రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జెఎన్‌టియు లో అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ గా, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, కళాశాల ఎస్సీ, ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ గా, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, అనంతపురం జె ఎన్ టియు పరీక్షల విభాగం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్‌గా, జె ఎన్ టి యు పాలక మండలి సభ్యులుగా, ఏపీ. ఈసెట్ కన్వీ నర్ గా, వర్సిటీ ఐసీఎస్ డైరెక్టర్‌గా, జె ఎన్ టియు రిజిస్ట్రార్ గా పనిచేశారు. శశిధర్‌ను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ కమిషన్ మెంబర్‌గా నియమించింది. ఈయన ఈ పదవిలో ఆరేళ్లు పాటు కొనసాగనున్నారు. ఈసందర్భంగా శశిధర్‌కు బోధన, బోధనేతర సిబ్బంది,సహచరులు అభినందనలు తెలియజేశారు.

అంగన్వాడీల పిల్లలకు 'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ఇచ్చిన హామీలు అమలు చేయాలి
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు
కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా




అంగన్వాడీల ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అంగన్వాడీల పిల్లలకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రేషన్ కార్డులివ్వాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లోబుల్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అంగన్వాడీలందరూ చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్వాడీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదన్నారు. రూ.12 వేలలోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసిందన్నారు. అంగన్వాడీల వర్కర్లకు రూ. 11,500లు, హెల్పర్, మినీ వర్కర్కు రూ. 7వేలు గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. అయితే అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్య.అని అన్నాను. ఈ విధానం ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. 2 జిబి ఫోన్లు ఇచ్చి 5 జిబి పనులు చేయమంటున్నారన్నారు.. ఇదే పరిస్థితి కొనసాగితే అంగన్వాడీ వర్కర్లు మానసిక వేదనతో మంచాన పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్వీ నాయుడు, రామాంజనేయులు, ముత్తుజ, వెంకటనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు కాత్యాయని, రేష్మ, రమణమ్మ, అరుణమ్మ, శ్రీదేవి, గోవిందమ్మ, మేరీ, రామాంజనమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మోసానికి చిరునామా 'బాబు'

యువజన విభాగం ఆధ్వర్యంలో యువత పోరు
కలెక్టరేట్ ఎదుట ధర్నాలో వైసిపి నాయకులు



కలెక్టరేట్ వద్ద ఆందోళనలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

మోసానికి చిరునామా చంద్రబాబు నాయుడు అని కూటమి ప్రభుత్వం యువతను నిలువునా మోసం చేసిందని వైసిపి నాయకులు విమర్శించారు. సోమవారం వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ ఎదుట 'యువత పోరు' నిర్వహించారు. యువత పోరుకు వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, సీనియర్ నాయకుడు రమేష్‌రెడ్డి, వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ సంఘీభావం తెలిపి ప్రసంగించారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. ఏడాది గడిచినా ఒక్క నిరుద్యోగికి కూడా రూ.3 వేల నిరుద్యోగ భృతి అందలేదన్నారు. ఒక్క ఏడాదిలో నిరుద్యోగభృతి బకాయి రూ.7200 కోట్లు అని అన్నారు. హామీలు అమలు చేయడంలో చంద్రబాబు విఫలం అయ్యారన్నారు. హామీలను అమలు చేయకపోతే కాలర్ పట్టుకోవాలని గతంలో నారా లోకేష్ చెప్పారని అనంత వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు చంద్రబాబు కాలర్ పట్టుకోవాలా? పవన్ కళ్యాణ్ కాలర్ పట్టుకోవాలా? లోకేష్ కాలర్ పట్టుకోవాలా? అని ప్రశ్నించారు. యువత పోరు నుంచి దృష్టి మరల్చేందుకే సింగయ్య మరణానికి సంబంధించి ఫేక్ వీడియోలను తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు.

వైసీపీ హయాంలో అమ్మ ఒడి పథకం కింద ప్రతి తల్లికి రూ.13 వేలు అందించి.. రూ.2 వేలను స్కూళ్ల అభివృద్ధికి కేటాయించి పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. గత ఎన్నికల సమయంలో ఈ పథకంపై కూడా విమర్శలు చేశారని, రూ.2 వేలు జగన్ జేబులోకి వెళ్తోంది అంటూ విమర్శించారన్నారు. తాము అధికారంలోకి వస్తే కోతలు, నిబంధనలు లేకుండా తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ఇప్పుడు రూ.13 వేలే ఇస్తున్నారని, మిగిలిన రూ.2 వేలు ఎవరి జేబులోకి వెళ్తోందని అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయాలని ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు.ప్రయివేటు కేసులకు వెనుకాడమని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం పోరాటం చేస్తుందని చెప్పారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో మలోలాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అనంతపురం నగర అధ్యక్షుడు శ్రీనివాసదత్త, జిల్లా ఉపాధ్యక్షులు దాదా ఖలందర్, గోచర్ల ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శులు లోకనాథ్‌రెడ్డి, సురేష్, సభ్యులు కుళ్లాయప్ప, సోహైల్, సాయికృష్ణ, కళ్యాణదుర్గం నియోజకవర్గ అధ్యక్షుడు తలారి చరణ్, యువజన విభాగం నాయకులు మణికంఠ రాయల్, బాబు, మైను, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, వైసీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ఖాళీబిందెలతో టీ సర్కిల్‌లో ఆందోళన



ఖాళీబిందెలతో రాస్తారోకో చేస్తున్న కాలనీవాసులు

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం టౌన్

పట్టణంలోని ఎర్రబండ కాలనీకి చెందిన మహిళలు తాగునీటి కోసం రోడ్డెక్కారు. వందలాది మంది మహిళలు ఖాళీ బిందెలతో టీసర్కిల్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. మూడు నెలలుగా తాగునీరు అందడంలేదని ఎవరికి చెప్పినా మా సమస్య పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ఇన్ని ఇబ్బందులు పడుతున్నా తమకు ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడికి చేరుకున్న మున్సిపల్ ఏఈ ఉపేంద్ర, ఇతర సిబ్బంది మహిళలకు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా వారిని చుట్టుముట్టి తమ బాధను వెళ్లగక్కారు. తాగునీటి కొళాయిలకు నీరివ్వాలని ఎన్నిసార్లు చెప్పుకున్న న్యాయం జరగలేదన్నారు. నీరివ్వకుండా ఇప్పుడు తమకు మాటలు చెప్పేందుకు వచ్చారా అంటూ నిలదీశారు. నడవడానికి చేతకాని వృద్ధులు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించేంతవరకు ఎవరి మాట వినమని తెగేసి చెప్పారు. సుమారు రెండుగంటల పాటు ఆందోళన చేపట్టడంతో రాకపోకలు స్తంభించాయి. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ మహిళలకు మద్దతుగా నిలిచారు. విషయం తెలుసుకున్న పట్టణ సిఐ యువరాజు టీసర్కిల్ చేరుకుని మహిళలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. అయినా వారు శాంతించలేదు. చివరికి మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ అక్కడికి చేరుకుని నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒకే ఒక్కరు

14 మందికి గాను ఒక్కరే విధుల నిర్వహణ
పరోక్షంగా అక్రమ నిర్మాణాలకు తోడ్పాటు
అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న స్వార్థపరులు
పురపాలక సంస్థ ఆదాయానికి గండి



అనంతపురం నగరపాలకసంస్థ కార్యాలయం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఈ విభాగంలో 14 మంది పనిచేయాల్సి ఉండగా ఒక్క అధికారి మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా పర్యవేక్షణ కొరవడటంతో నగరంలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇదే అదనుగా భావించి కొందరు స్వార్థపరులు నిర్మాణదారుల వద్ద అక్రమవసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరం విస్తరిస్తున్న కొద్దీ నూతన భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి అయితే మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో 14 మందికి గాను ఒకే ఒక్కరు విధులు నిర్వహిస్తున్నారు పాలకవర్గం నేత అనుకూలురన్న పేరుతో ముద్ర వేసి ఒకరిని చేర్చుకోవటం లేదని సమాచారం. టౌన్ ప్లానింగ్ విభాగంలో రెండు అసిస్టెంట్ సిటీ ప్లానర్ పోస్టులు, ఇద్దరు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, నలుగురు టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, ఆరుగురు బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు ఉండాలి.అయితే కేవలం ఒకే ఒక్క టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆమె సైతం బైపాస్ సర్జరీ చేసుకున్న దృష్ట్యా కార్యాలయానికి పరిమితం అయ్యారు. నగరంలో 74 సచివాలయ ప్లానర్లు ఉండగా వారిలో కొంతమంది బిల్డర్లుగా అవతారాలు ఎత్తి నిర్మాణ కార్యకలాపాల్లో జోరుగా పాలుపంచుకుంటున్నారని సమాచారం. బిల్డింగ్ అనుమతులు జారీ కాకనే భవన నిర్మాణాలు యదేచ్ఛగా సాగిపోతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి వాటిని అరికట్టాల్సిన ఉద్యోగులు స్థానిక వార్డు ప్రజాప్రతినిధుల జోక్యంతో మిన్నకుండిపోతున్నారని సమాచారం. భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నా వార్డు నేతల ధన దాహానికి బలవుతున్నారు చిన్నపాటి నిర్మాణం జరిగినా లక్షల రూపాయలు కప్పం కట్టి తీరాల్సిందేనని బెదిరింపులకు దిగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వార్డు ప్రతినిధులకు కప్పం చెల్లించకుంటే అధికార యంత్రాంగం ద్వారా నిర్మాణాలు నిలిపి వేయించి ముక్కు పిండి కప్పం వసూలు చేస్తున్నట్టు నగర ప్రజలు వాపోతున్నారు గతంలో కొంతమంది అధికారులు లక్షల రూపాయలు వసూలు చేయించి ఇచ్చేవారని ఇప్పుడు ఎందుకు ఇప్పించరి అధికార యంత్రాంగంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నగరంలో కొంతమంది ప్రబుద్ధులు జట్టుగా ఏర్పడి నూతన భవన నిర్మాణాలు చేపట్టడం ఆలస్యం రాబందుల్లా వాలిపోతూ లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని నిర్మాణదారులు వాపోతున్నారు వీటిని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం వారి అడుగులకు మడుగులు ఒత్తుతూ మిన్న కుండిపోతున్నారన్న విమర్శలున్నాయి. దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి వచ్చిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులును పాలకవర్గ నేతకు అనుకూలుడన్న ముద్ర వేసి ఆయన జాయిన్ కాకుండా ముఖ్య నేత అడ్డు తగిలారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు దీనితో ఆయన రాజమండ్రికి అసిస్టెంట్ సిటీ ప్లానర్ గా బదిలీ ఉత్తర్వులు తెచ్చుకుని వెళ్లిపోయారు. అలాగే మరో అధికారిని కూడా పాలకవర్గ నేత అనుకూలమని ముద్ర వేసి సాగ నంపై ఏర్పాట్లు చేశారు. దీంతో గడచిన 22 రోజులుగా ఆ ఉద్యోగి విధులకు హాజరు కాలేని పరిస్థితి నెలకొంది. ఇలా ఉన్న వారిని పంపేశారు. ఖాళీగా ఉన్న 13 పోస్టుల భర్తీకి అర్బన్ నేతగాని ఉన్నతాధికారి కానీ చర్యలు చేపట్టలేదు. మూడు రోజుల క్రితం అర్బన్ నేత మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారులతో అంతర్గత సమీక్ష సమావేశం నిర్వహించారు ఇంజనీరింగ్ అధికారులతో ప్రతి చిన్న అంశాన్ని సమీక్ష జరిపిన అర్బన్ నేత టౌన్ ప్లానింగ్ లో ఒకే ఒక్క అధికారి ఉండటంతో చర్చించేది ఏమీ ఉంటుందని ఎలాంటి చర్చ లేకుండానే సమీక్ష ముగించారు. ఈ పరిస్థితికి కారణమెవ్వరన్న ప్రశ్నలు నగరవాసుల్లో వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాకు భవన నిర్మాణాల పేరిట రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయానికి గండిపడుతున్న పట్టించుకునే వారు కరువయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతుండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడంతో అక్రమార్కులు కాసుల దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. సాధారణంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తమ హవా సాగించాలనుకునే నేతలు మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతుంటే ప్రేక్షక పాత్ర వహించటం సరి కాదన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

బిజెపితో లౌకిక వాదానికి విఘాతం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ర్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

లౌకిక వాదానికి, అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విఘాతం, కలిగించే విధానాలను అనుసరిస్తోందని దీనివల్ల దేశానికి ప్రమాదకరమని,ఈ విధానాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. సోమవారం అనంతపురంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్. శ్రీరాములు అధ్యక్షతన జరిగిన నగర మహాసభలలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుల,మతాల మధ్య ఘర్షణ సృష్టించి రాజకీయ లబ్ది పొందడానికి కుట్రలు, కుతంత్రాలు చేస్తుందని ఆయన ఆరోపించారు. బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఒక్క మంచి పని కూడా చెప్పుకోవడానికి ఏమీ లేదని అన్నారు.ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా భారతదేశంలో 14.60 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ పేదరికంలో మగ్గుతున్నారని అంతేకాకుండా విచ్చలవిడిగా అవినీతి, నిరుద్యోగం పెరిగిందని అన్నారు. బిజెపి విధానాలను ప్రశ్నించే వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారన్నారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగారని ట్రంపు విధానాలను కూడా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచంలో శాంతి నెలకునాలంటే కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాజా రెడ్డి,. ఎఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జాన్సన్ బాబు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష కుమార్, నగర సిపిఐ సహాయ కార్యదర్శులు బి. రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంగమేష్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, ఉపాధ్యక్షులు రామిరెడ్డి, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకట నారాయణ, ముత్తూజ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం.నాగరాజు, నగర అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, తిరుమలేశు హాజరై మాట్లాడారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి కూడా కార్మికులకు వర్తించలేదన్నారు. తక్షణమే మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న సరెండర్ లీవ్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతపురం నగరపాలక సంస్థ నందు పారిశుధ్యం విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు పని భారంతో సతమతమవుతున్నారని తెలిపారు. పెరిగిన నగరానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కరోనా విపత్తు కాలంలో విధుల్లోకి తీసుకున్న అదనపు కార్మికులకు రూ.15 వేలు వేతనాలు ఇవ్వాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. వారికి రావాల్సిన డెత్ బెనిఫిట్ స్కీము వర్తింపజేయాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్ఓ మలోలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు సాకే లక్ష్మీనారాయణ, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, ఆఫీస్ బేరర్స్ నారాయణ, బుడ్డ కోనప్ప, బండారి స్వామి, రాఘవ, పెన్నా జయరాం, వరలక్ష్మి, ఇమాంబి, శశింద్ర కుమార్, కమిటీ సభ్యులు రవి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలి

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అనంతపురం నగలపాలక సంస్థలో పని చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతపురం నగరపాలక సంస్థ నుంచి టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్ కార్యాలయం వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎస్. ముత్తుజా, వై. వెంకటనారాయణ హాజరై వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనంతో పాటు అన్ని రకాల సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష కార్యదర్శులు మురళి, ఓబుళపతి, కోశాధికారి పోతులయ్య, తాడపత్రి, జుబేర్, గుత్తి రమణ, నాయకులు శివన్న, సుబ్బిరెడ్డి, గౌరీ, లక్ష్మీ, జగదీష్, వన్నప్ప, సలీం తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పొగాకు నియంత్రణ జిల్లా సామాజిక కార్యకర్త బి.శ్రీరాములు

ప్రజాశక్తి-అనంతపురం

పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పొగాకు నియంత్రణ జిల్లా సామాజిక కార్యకర్త బి.శ్రీరాములు డిమాండ్ చేశారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ మాసోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఇబి దేవి ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సిగరెట్టు, ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. అనంతరం పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, అసిస్టెంట్ గ్రంథాలయ అధికారి గోవింద్, పాఠకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎడిసిసి బ్యాంకు 129వ మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం

ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అధ్యక్షతన సోమవారం బ్యాంకు 129వ మహాజనసభ నిర్వహించారు. ఇందులో భాగంగా బ్యాంకు సిఇఒ కె.సురేఖరాణి 2024-25 సంవత్సరానికి సంబంధించిన స్టాట్యూటరీ ఆడిట్ రిపోర్టును ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. తదుపరి 2024- 25 సంవత్సరానికి సంబంధించిన జమా ఖర్చులు, 2025-26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపులను ఆమోదించారు. 2024 25వ సంవత్సరానికి సంబంధించిన లాభాలు రూ.1,52,98,822 బైలా ప్రకారం వివిధ పద్దులకు కేటాయించారు. ఈ సందర్భంగా బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు, సంఘాల సమిష్టి కృషితో బ్యాంకును అభివృద్ధి బాటలోకి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం, జిల్లా సహకార అధికారి, బ్యాంకు సీనియర్ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పర్సన్ ఇన్‌ఛార్జిలు, బ్యాంకుకు అనుబంధంగా ఉన్న సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ముగేత్తంపల్లి రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన



కంకర రోడ్డును పరిశీలిస్తున్న ఎంపిడిఒ మమతాదేవి

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని ముగేత్తంపల్లి రోడ్డును ఎంపిడిఒ మమతాదేవి మంగళవారం పరిశీలించారు. సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో 'కంకర తేలిన ముగేత్తంపల్లి రోడ్డు.. ఇబ్బంది పడుతున్న వాహనదారులు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎంపిడిఒ స్థానిక పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధుతో కలిసి కంకర తేలిన రోడ్డును పరిశీలించారు. ముగేత్తంపల్లి నుంచి గూగూడు వరకూ రోడ్డును పరిశీలిస్తూ వచ్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా హెచ్చెల్సీ నుంచి ముగేత్తంపల్లి వరకు రోడ్డు మరమ్మతులు చేస్తామన్నారు. అదేవిధంగా ముగేత్తంపల్లి నుంచి గూగూడు వరకూ ఎంపీ నిధులు రూ.40లక్షలతో ప్యాచ్‌వర్క్‌లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆమోదం వచ్చిన వెంటనే రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఇంజినీర్ రమణయ్య, తదితరులు తెలిపారు.

'అన్నదాత సుఖీభవ' రూ.20వేలు ఒకేసారి ఇవ్వాలి

వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఒకేసారి రూ.20వేలు ఖాతాల్లోకి జమచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శ్రీశైలరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద ఒకేసారి రూ.20వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని, తల్లికి వందనం పెండింగ్ డబ్బులను తల్లుల ఖాతాలకు వేయాలని, హెచ్చెల్సీ చివరి ఆయకట్టు సలకంచెరువు చెరువుకు నీరు ఇవ్వాలని, కాలువ వెడల్పు చేసి పూడికతీతక పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే అడిగి వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు చెల్లించాలని, పనులు చేసేచోట కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, కొండారెడ్డి, శ్రీనివాసులు, ధనాంజనేయులు, ఆంజనేయులు, వెంకటస్వామి, జయరాముడు, కుళ్లాయిస్వామి, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ సదస్సుకు వజ్రకరూరు సర్పంచి



ఉరవకొండ : ఢిల్లీలో జరిగే మహిళా రిప్రేష్‌వెంటేట్-2025 నాయకత్వ అభివృద్ధి సదస్సుకు వజ్రకరూరు సర్పంచు మొనాలిసా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ అనే ప్రఖ్యాత సంస్థ దేశవ్యాప్తంగా మహిళా ప్రజాప్రతినిధుల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈఏడాది 45 మంది మహిళా ప్రజాప్రతినిధులను ఎంపిక చేయగా వారిలో తాను ఉన్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో ఏడురోజుల పాటు పాలన, కమ్యూనికేషన్, ప్రజానైతికత, నాయకత్వ నైపుణ్యాలు, సమస్యల పరిష్కార పద్ధతులు, పార్లమెంటు సందర్శన, తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, నిపుణులు, అనుభవజ్ఞులైన నాయకులతో ప్రత్యక్ష సంభాషణలు ఉంటాయన్నారు. అలాంటి కార్యక్రమానికి ఎంపిక కావడం అదృష్టమన్నారు.

'ఆశా' పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం : జిల్లాలోని ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 58 మంది ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈనెల 25 నుంచి 30వతేదీ సాయంత్రం 5 గంటలోపు సంబంధింత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాల్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ https ://ananthapuramu.ap.gov.inను సందర్శించాలని కోరారు.

వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నాగరాజు




కళ్యాణదుర్గం రూరల్ : వైసిపి మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గూబనపల్లి నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు వైసిపి అధినేత జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తనకు పదవి వచ్చేందుకు సహకరించిన జగన్‌తోపాటు నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వర నాయుడు, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎస్ ట్యాంక్, పంప్‌రూమ్ పరిశీలన

రాయదుర్గం : పట్టణానికి తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, పంప్‌రూములను మున్సిపల్ అధికారులు సోమవారం పరిశీలించారు. కణేకల్ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, పంప్‌రూము, వీరాపురం వద్ద పంపురూమ్‌లను కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్, అసిస్టెంట్ ఇంజినీర్ నరసింహులు తదితరులు పరిశీలించారు. అలాగే వీరాపురం, కనేకల్ వద్ద గల ఎస్ఎస్ ట్యాంక్, శుద్ధి చేయని నీటి పంపురూములను పరిశీలించారు.

నార్పల ఆర్ఐగా మంజుల



నార్పల : మండల ఆర్ఐగా మంజుల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన జ్యోతిరాణి అనంతపురానికి బదిలీ కాగా అనంతపురంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న మంజుల బదిలీపై బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారుల సహకారంతో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

ఉద్యోగోన్నతులు కల్పించి బదిలీలు చేయాలి

మున్సిపల్ ఆర్‌డి కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగుల ధర్నా



ఆర్‌డి కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఉద్యోగోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని సచివాలయ ఉద్యోగుల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సచివాలయ ఉద్యోగులు సోమవారం పట్టణంలోనిమున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జెఎసి నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు సీనియారిటీ, రోస్టర్ జాబితా మేరకు ప్రమోషన్స్ కల్పించిన తర్వాతనే బదిలీలు చేయాలని కోరారు. గతంలో జారీ చేసిన జీవో 523ని రద్దు చేయాలని, అమెండ్ చేసి విద్యార్హతను బట్టి ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అందరికీ నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరయ్యే విధంగా చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న రికార్డ్ అసిస్టెంట్ పే స్కేల్‌ను జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌గా వర్తింపజేయాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌డిఎంఎ విశ్వనాథంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, మల్లికార్జున, హనుమంతు, శివశంకర్, మహేష్, వినయ్, మంజునాథ్, విమల, మౌలాలమ్మ, స్వాతి, హారతి, శశికళ, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయదుర్గం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాయదుర్గం పురపాలక సంఘం సచివాలయ ఉద్యోగులు కమిషనర్ దివాకర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తాము సంస్థగతమైన, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థలో రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టడం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యంగా జీవో ఎంఎస్ నెంబర్ 5 నుంచి తమను మినహాయించాలని, బదిలీలకు ముందు ఉద్యోగోన్నతులు చేపట్టాలని, డిప్యుటేషన్లకు బదులుగా ప్రమోషన్లు ఇవ్వాలని, సర్వీస్ రూల్స్, పదోన్నతులు కల్పించాలని, జాబ్‌చార్ట్ తయారు చేసి అమలు చేయాలని, టెక్నికల్ ఉద్యోగోన్నతులు కల్పించాలని, డిఎ, పిఆర్‌సి నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, సర్వే భారం తగ్గించాలని కోరారు.

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సచివాలయ ఉద్యోగుల నాయకులు గణేష్, ఉపేంద్ర, నవీన్‌రెడ్డి, దివ్య శిల్ప, శ్రీకాంత్, శ్రీకాంత్, మనోజ్, ప్రవీణ్, నల్లప్ప, నీలిమ, కృష్ణయ్య, గడ్డ రాము, దివాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల కడుపుకొడితే ఊరుకోం

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపల్ కార్మికుల కడుపుకొడితే ఊరుకునేదిలేదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను మోసం చేస్తూ అవినీతికి పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ అలీఖాన్, హెల్త్ అసిస్టెంట్ తిప్పేస్వామిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ అసిస్టెంట్ ముగ్గురు కార్మికులతో రూ.5వేల చొప్పున డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కొందరు అధికారుల ఇంటి పన్నులకు కార్మికులను వాడుకుంటున్నారన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తిప్పేస్వామి, వన్నూరుస్వామి, నటరాజ్, శివకుమార్, వెంకటేష్, శివయ్య, లలితమ్మ, బొజ్జక్క, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

గుంతకల్లు : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికుల జెఎసి జిల్లా అధ్యక్షుడు టిజి సురేష్, పట్టణ అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షులు మస్తాన్, లక్ష్మీనారాయణ, సాయిపోగు సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో రెండు నెలలుగా ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్నా ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు సోమవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు వివరించారు. తమ సమ్మెకు పట్టణ ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

సమ్మె సిపిఎం సంపూర్ణ మద్దతు

మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ తెలిపారు. ఈమేరకు దీక్ష శిబిరం వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కెఎం బాషా, రామునాయక్, చంద్రశేఖర్, షాషా, వంశీ, ఖాదర్, మక్బూల్, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమికి ఖాతా నెంబర్ కేటాయించాలి

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య




వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-ఉరవకొండ

కడమలకుంట గ్రామంలోని సుబ్రమణ్యస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నెంబర్ 110లో ఉన్న 25.55 ఎకరాల భూమికి ఖాతా నెంబర్ కేటాయించాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎపి కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో వజ్రకరూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కడమలకుంట గ్రామ పొలం సర్వే నంబర్ 110లో సుబ్రమణ్యస్వామి ఆలయానికి సంబంధించిన 25.55 ఎకరాల భూమిని అదేగ్రామానికి చెందిన కౌలు రైతులు 50ఏళ్ల నుంచి గుత్త చెల్లించి సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ రైతులకు సిసిఆర్‌సి కార్డులో సర్వే నెంబర్ 110 మాత్రమే ఉందన్నారు. ఖాతా నెంబర్ జీరోగా ఉండడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవడానికి వ్యవసాయ అధికారుల వద్దకు వెళితే ఖాతా నెంబర్ లేకపోతే చేయడానికి అవకాశం లేదన్నారు. ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అన్నదాత సుఖీభవ పంట నష్టపరిహారంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా కౌలు రైతులు నష్టతున్నారన్నారు. కావున కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి, ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, బీమా వంటి పథకాలకు అర్హులు కావాలంటే ఖాతా నెంబర్ అవసరమన్నారు. కావున వెంటనే ఖాతా నెంబర్ కేటాయించాలని తహశీల్దార్ నరేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం ఉరవకొండ నియోజకవర్గం కార్యదర్శి వెంకటేశులు, మండల నాయకులు సుంకన్న, సురేంద్ర, నాగప్ప, రామదాసు, ఎర్రిస్వామి, రామాంజినమ్మ, కదిరమ్మ, పార్వతి, లలితమ్మ, సుంకమ్మ, వసంతమ్మ, సుంకన్న, బ్రహ్మయ్య, సురేష్ పాల్గొన్నారు.

సచివాలయ సర్వేయర్ల పెన్‌డౌన్



శింగనమల ఎంపిడిఒ భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

గ్రామ సర్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా సర్వేయర్లు పెన్‌డౌన్ చేసి శాంతియుత నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో, తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సర్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

యాడికి : సర్వేయర్ల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో మండలంలోని గ్రామ సర్వేయర్లు తహశీల్దార్ ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు మౌలాలి, మహబూబ్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భార్గవ్, దావూద్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : ఉద్యోగోన్నతులు కల్పించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని మండలంలోని సర్వేయర్లు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, శివానంద, నాగేంద్రతోపాటు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పుట్లూరు : రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సర్వేయర్లు చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్వేయర్లు మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు కల్పించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బొమ్మనహాల్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని సర్వేయర్లు తహశీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందించారు.

పొగాకు కొనుగోలు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

నిల్వ ఉన్న పొగాకును తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఊరుచింతల గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలో పొగాకు సాగు చేసిన రైతులు వద్ద వందల క్వింటాళ్లలో పొగాకు నిల్వ ఉందన్నారు. పొగాకు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని క్వింటా రూ.15వేల మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, పొగాకు రైతులు జనార్ధన్, బాలకృష్ణ, పాపయ్య, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియులో 172 మంది చేరిక

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో పని చేస్తున్న స్వీపర్స్, కార్మికులకు ఈపీఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ఏపీ హెల్త్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పవన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సర్వజనాసుపత్రి ఎదుట సిఐటియు స్తూపం వద్ద సర్వజనాసుపత్రి కార్మికులు సిఐటియులో సభ్యులుగా చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిపర్స్ కార్మికులు 15, 20, సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఈపీఎఫ్ ఈఎస్ఐ నోచుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలు పోషించుకోలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే పని భారాలతో ఇబ్బంది పడుతున్న మా సమస్యల గురించి అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వాలకు చెప్పేవారు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కార్మికులు మాట్లాడుతూ సిఐటియు సంఘం అనేది అలుపెరుగని పోరాటాలతో బడుగు బలహీన వర్గాల కోసం కార్మిక వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేసి కార్మికుల చట్టాలను కార్మికులకు అందేలా చేస్తోందన్నారు. సిఐటియు జెండాను ఆశ్రయించి సిఐటియు నాయకత్వంతో మాట్లాడి 72 మంది మేము సిఐటియు సంఘంలో చేరినట్లు తెలిపారు. తొలుత సిఐటియు జెండాను నాయకులు ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఏపి మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు బోర్డు గవర్నమెంట్ హాస్పిటల్ ఎదుట ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజ, సిఐటియు నగర ట్రెజరర్ ఎన్టీఆర్ సీనా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం.నాగరాజు, జిల్లా కమిటీ సభ్యురాలు మంత్రి వరలక్ష్మి, సిఐటియు నగర ఆఫీస్ బేరర్లు, సురేంద్ర, ఆజాం, కిష్ట, ఆది, ఏరిస్వామి, స్వాతి, అంబులెన్స్ యూనియన్ నాయకులు అక్బర్, రాజు, ఎంఎన్ఓ నాయకులు ఆరిఫ్, ఎఫ్ఎన్ఓ నాయకులు సులోచన, అనిలా తదితర నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. గుంతలమయమైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా జెడ్.వీరారెడ్డి కాలనీకు ప్రధాన రహదారి లేక కాలనీవాసులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలో వీధిలైట్లను ఏర్పాటు చేయాలన్నారు. అంతర్గత రహదారులను నిర్మించాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, నాయకుడు నవీన్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, నాయకులు రంగస్వామి, చందు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల ఎపిఒగా భాగ్యలక్ష్మి



శింగనమల : ఉపాధి హామీ పథకం ఎపిఒగా భాగ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కళ్యాణదుర్గంలో పని చేసిన భాగ్యలక్ష్మి బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

యల్లనూరు ఎపిఒగా ఓబుళరెడ్డి

యల్లనూరు : యల్లనూరు మండల ఉపాధి హామీ పథకం ఎపిఒగా కె.ఓబుళరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం నుంచి యల్లనూరు మండలానికి బదిలీపై వచ్చారు.

మండల వ్యవసాయ అధికారిగా మధు

యల్లనూరు : యల్లనూరు మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారిగా మధుకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి రామకృష్ణ ఉరవకొండకు బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ అసిస్టెంట్ ఎఒగా విధులు నిర్వహిస్తున్న మధుకుమార్‌ను ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారిగా నియమించారు.


బుక్కరాయసముద్రం ప్రజాశక్తి విలేకరిపై దాడికి యత్నం

పోలీసులకు ఫిర్యాదు

బుక్కరాయసముద్రం : పంచాయతీ స్థలం ఆక్రమణను అడ్డుకున్నందుకు ప్రజాశక్తి విలేకరి పెద్దన్నపై దాడి జరిగింది. ఈ దాడి ఘటనపై విలేకరి పెద్దన్న పోలీసులు ఫిర్యాదు చేశాడు. మండల పరిధిలోని పసలూరు పంచాయతీలో గ్రామ పంచాయతీకి చెందిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన బాలపెద్దన్న, పెద్దన్న, పి.పెద్దన్న, పెద్దన్న, ఓబులేసు అనే నలుగురు ఆక్రమించి అందులో ముళ్లకంపలు, పాతవస్తువులు వేశారని, వాటిలో విషపురుగులు చేరుతుండటంతో వాటిని కాల్చివేసినందుకు తనపై దాడికి పాల్పడ్డారని బాధితుడు తెలిపారు. వీరినుంచి తనకు రక్షణ కల్పించి పంచాయతీ స్థలాన్ని కాపాడాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పెద్దన్న తెలిపారు.

విద్యుత్ తీగలపై పడ్డ చెట్టుకొమ్మ

ప్రజాశక్తి-రాయదుర్గం



ఒరిగిన విద్యుత్ స్తంభం

పట్టణంలోని లక్ష్మీబజార్‌లో ఉన్న రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం చెట్టుకొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో పక్కన ఉన్న సిమెంట్ విద్యుత్ స్తంభం నేల కూలింది. ఈ ఘటనతో రోడ్డు పక్కన నిల్వ ఉంచిన రెండు మోటార్ సైకిళ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ వైర్లలో చెట్టుకొమ్మలు ఇరుక్కొని ఉన్నందున గాలివాన వచ్చిన ప్రతిసారి చెట్టుతోపాటు పోల్స్ కూడా ఊగేవి. ఈ విషయం ఏడాదికాలంగా విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నా పట్టిచుకోలేదని స్థానికులు వాపోయారు. విద్యుత్ స్తంభం ఉన్నత పాఠశాల పక్కనే ఉండటతో పిల్లలందరూ పాఠశాలకు చేరుకున్న 15 నిమిషాల తర్వాత ప్రమాదం జరిగిందన్నారు. వెంటనే విద్యుత్ సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించి స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని బీసీ కాలనీ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో బొందలవాడ గ్రామానికి చెందిన నాగభూషణం (48) అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య అలివేలమ్మ, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జూదరులు అరెస్టు

పెద్దపప్పూరు : మండలంలోని చిక్కేపల్లి గ్రామంలో పేకాట ఆడుతుండగా ఏడుగురిని అరెస్టు చేసినట్లు సిఐ రామసుబ్బయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చిక్కేపల్లిలో పేకాట ఆడుతున్నట్లు తెలుసుకున్న పోలీసు సిబ్బంది దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితుల నుంచి రూ.6,235 నగదు, ఐదు మొబైల్ ఫోన్‌లు, నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న దగ్గుపాటి చరణ్

సిఎంఎం అవార్డు అందుకున్న దగ్గుపాటి చరణ్

అనంతపురం కలెక్టరేట్ : ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు మండలం బండమీద పల్లి గ్రామానికి చెందిన దగ్గుపాటి చరణ్ (సిఏ) సిఎంఐలో ఆల్ ఇండియాలో 41వర్యాంక్ ను సాధించాడు. అనంతపురం నియోజకవర్గ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుటుంబసభ్యుడు, టిడిపి నాయకుడు దగ్గుపాటి రాజ, దగ్గుపాటి దీప్తిల తనయుడు దగ్గుపాటి చరణ్ ఈ అవార్డును సోమవారం ఢిల్లీలో జరిగిన సిఏ సిఎంఐ సమ్మిట్‌లో అందుకున్నారు. బండమీద పల్లి గ్రామానికి చెందిన చరణ్ ఈ అవార్డును అందుకోవడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గ్రామ ప్రజలు అభినందించారు.

ఉద్యాన పంటలకు దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్ : ఉపాధి హామీ పథకం కింద రైతులు ఉద్యాన పంటలకు దరఖాస్తు చేసుకోవాలని ఎపిఒ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2025-26వ ఆర్థిక సంవత్సరంలో కంబదూరు మండలంలో 650 ఎకరాల్లో సపోటా, జామ, చీనీ, మామిడి, నేరేడు, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, మునగ, తదితర ఉద్యానవన పంటలతోపాటు 25 సెంట్లలో మల్లె, గులాబీ, తదితర పూలపంటలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రభుత్వ హాస్టల్‌లో వసతి కల్పించాలి

గుత్తి : దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు ప్రభుత్వ హాస్టల్లో వసతి కల్పించడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, ధను డిమాండ్ చేశారు. సోమవారం విద్యారంగ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ జి.పుణ్యవతికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో బీసీ విద్యార్థినులకు సీట్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థినులకు 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గిరిజన సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుకునే అవకాశం ఉండేదన్నారు. ఈ ఏడాది బీసీ విద్యార్థినులకు సీట్లు ఇవ్వరాదని జిల్లా అధికారులు వార్డెన్లకు చెప్పారన్నారు. హాస్టల్లో బిసి విద్యార్థినులకు వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విఆర్ఎకు నివాళి

ప్రజాశక్తి - శింగనమల

మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకులు ఎట్టి ఈశ్వరయ్య మృతికి తహశీల్దార్ శేషారెడ్డి సోమవారం నివాళులర్పించారు. ఈశ్వరయ్య ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకుని ఈశ్వరయ్య మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల కింద రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు ఓబులేసు, విఆర్ఒలు రాముడు, ప్రసాద్, తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న తహశీల్దార్ శేషారెడ్డి

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

అనంతపురం : ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎల్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మండల రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎల్ఆర్‌పిఎస్ జిల్లా నాయకులు ఎస్.ఓబులేసు, బేరిల రవికుమార్, ఎం.సోమశేఖర్, మహాలింగ, మల్లేష్, రామాంజినేయులు, రాజశేఖర్, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశ్రాంతి భవనం నిర్మించండి

రాయదుర్గం : వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చే రైతుల సౌకర్యార్థం విశ్రాంతి భవనం నిర్మించాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, బిసివై పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఉండాల హనుమంతురెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు మార్కెట్ యార్డుకు వస్తుంటారని, వారి కోసం విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు కమిటీ అధ్యక్షులు హనుమంతరెడ్డి సమాధానం ఇస్తూ రైతుల కోసం విశ్రాంతి భవనం నిర్మించడమే గాక వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉంచేందుకు శీతల గిడ్డంగిని నిర్మిస్తామన్నారు. అంతేకాక మార్కెట్ కమిటీ ఆదాయం పెంపుకై షాపింగ్ కాంప్లెక్స్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

యల్లనూరు : మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చెసుకోవాలని తహశీల్దార్ రాము తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలుగ్రామాల్లో రీసర్వే చేశారన్నారు. ఈ సర్వేలో కొన్ని భూములు జాయింట్‌లో పడ్డాయన్నారు. అలాంటి వాటికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సక్రమంగా నిత్యావసరాలు పంపిణీ చేయాలి

బెలుగుప్ప : రేషన్ డీలర్లు నెలనెలా సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు చెందాల్సిన నిత్యావసర సరుకుల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా పంపిణీ చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావు, ఆర్ఐ నగేష్‌బాబు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌స్టేషన్ తనిఖీ

రాయదుర్గం : పట్టణంలోని రోహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్, మద్యం దుకాణాన్ని అనంతపురం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి స్థానిక ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0, అక్రమ కర్ణాటక మద్యం నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు, కర్ణాటక మద్యం సరఫరాదారులపై పీడీ యాక్ట్ ప్రయోగం, జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఇఎస్ శ్రీరామ్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ రాయదుర్గం మహేష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అధికారులు అహంకార ధోరణి వీడాలి : ఎంపిపి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిపి హేమలత

ఆత్మకూరు : ప్రభుత్వ అధికారులు అహంకార ధోరణి వీడి ప్రజలకు సేవ చేయాలని ఎంపిపి హేమలత సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో కొందరు అధికారులు బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్నారన్నారు. ఎవరి స్థాయి ఏంటో తెలియకపోతే తెలుసుకోవాలని సూచించారు. తెలిసి కూడా అహంకార ధోరణితో అధికార పార్టీ నాయకుల మెప్పు పొందడానికి తమకు గౌరవం ఇవ్వకపోవడం సరికాదన్నారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రోటోకాల్ పాటించడం మానేశారన్నారు. పైకి ఒకలా.. లోపల మరోలా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయా విషయాలను ఉన్నతాధికారులు దృష్టి సారించి, రానున్న రోజుల్లో వాటిని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

భూ ఆక్రమణలను అరికట్టాలని వినతి

కుందుర్పి : మండల కేంద్రంలోని కొండలు, గుట్టల ఆక్రమణలను అరికట్టాలని మాజీ సర్పంచు పెద్ద నరసింహప్ప, మాజీ మండల కన్వీనర్ పెద్ద ఓబులేసు, వార్డు మెంబర్ బంగారి నారాయణప్ప, ఆరుడప్ప, తదితరులు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమ పేరుతో కొంతమంది దెయ్యాల దుబ్బగుట్టకు కంచె వేసి ఆక్రమించుకోవడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి స్థలాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఈరలింగ, మాజీ డైరెక్టర్ బసప్ప, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-పామిడి



తహశీల్దార్ షర్మిలకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

మండల పరిధిలోని గజానాంపల్లి గ్రామంలో 20ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు అనిమిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గజానాంపల్లి మల్లేష్ మాట్లాడుతూ గ్రామంలోని 296 సర్వేనెంబర్‌లో దాదాపుగా 8 ఎకరాల భూమిని 20ఏళ్లుగా ఒక్కొక్కరు 40 సెంట్ల ప్రకారం సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే గ్రామంలో కొందరు సంబంధిత భూమి దేవాదాయ శాఖకు చెందినదిగా అపోహలు సృష్టిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం నాయకులు మండల నాయకులు ఈశ్వరయ్య, ముత్యాలు, వెంకటేష్, నారాయణ, లాలెప్ప, శివలక్ష్మి, రామచంద్ర, మల్లికార్జున, సుంకరత్నమ్మ, చంద్ర, స్వప్న, మారన్న, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, జెఎసి రాష్ట్ర కన్వీనర్ మధుప్రసాద్

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ కళాశాల ఫీజులు దోపిడీని అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ జెఎసి రాష్ట్ర కన్వీనర్ మధుప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ మండలంలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు జీవో నెంబర్.1ను అమలు చేయకుండా విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో వైసిపి విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు సాకే పురుషోత్తం, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, జివిఎస్ఎస్ మండల అధ్యక్షులు సాకే మహేంద్ర, రాము, ఎంఆర్‌పిఎస్ మధు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

ఉరవకొండ : ఉరవకొండలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్రకిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయమ్మ, టిడిపి నాయకులు ప్యారం కేశవ్, స్కూల్ కమిటీ ఛైర్మన్ హరి, వైస్‌ఛైర్మన్ చావాల చంద్రశేఖర్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొకుంట్ల రవి, వార్డు సభ్యులు మీనగ రామాంజనేయులు, ఎస్సీ సెల్ నాయకులు వరప్రసాద్, స్టోర్ డీలర్ నరసింహులు, లైబ్రేరియన్ కుళ్లాయమ్మ, రమా, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థులకు గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ నీమారాజ్, శశాంక్ బాబు, అక్కులన్న, రాందాస్, ఓబుళపతి, బూత్ కన్వీనర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం వాయిదా

రాయదుర్గం : పట్టణంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు దుకాణాల వేలంపాటలు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ ఆవరణలోని ఎ.బి.సి బ్లాక్‌లో ఖాళీగా ఉన్న ఆరు రూములకు మున్సిపల్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో వేలంపాటలు నిర్వహించారు. అయితే పాటలో పాల్గొనేందుకు ఎవరూ రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు ప్రకటించారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలుపుతామన్నారు.

ఆర్థికసాయం

పుట్లూరు : ఈనెల 13వతేదీన కుక్కల దాడిలో 37 గొర్రెలు మృతిచెందిన బాధితుడు చిన్న బొజ్జన్న గారి శ్రీనివాసులుకు భూమిరెడ్డి గారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.55వేలు ఆర్థికసాయం అందించారు. ఈమేరకు భూమిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు తరపున సభ్యులు బిభూమిరెడ్డి వాసుదేవరెడ్డి, పెద్దనారాయణరెడ్డి కలిసి బాధితుడికి మొత్తాన్ని అందజేశారు.

గోశాల పరిశీలన

గుంతకల్లు రూరల్ : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న తోటలో దాతల సహకారంతో నిర్మిస్తున్న గోశాలను ఆలయ ఉప కమిషనర్ వాణి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువగా గోదానం చేస్తున్నారన్నారు. దీంతో ఆలయ పకారం పక్కనే ఉన్న గోశాల సరిపోకపోవడం లేదన్నారు. చేసేదిలేక నూతనంగా గోశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఎంటిఎస్ ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్

అనంతపురం సిటీ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంటిఎస్ ఉపాధ్యాయులకు మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డిఇఒ ప్రసాద్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో ఉదయం 9 గంటల నుంచి కౌన్సిలింగ్ ప్రారంభమవుతుం దన్నారు. కావున ఆ సమయంలోపు ఎంటిఎస్ ఉపాధ్యాయులందరూ హాజరు కావాలన్నారు.